సాక్షి ఖమ్మం

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



ఇంకా ఎన్నాళ్లు చేస్తావ్?

సత్తుపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో ఉద్యోగులపై కలెక్టర్ గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో



నకిలీ నోట్ల ముఠా అరెస్టు

అసలు నోట్లతో కలిపి నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న ముఠాను కొత్తగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో



వాతావరణం

శనివారం జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కనకగిరి గుట్టల్లో చిరుతల సంచారం



కలపను పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ మంజుల

ఏన్కూరు: జిల్లాలోని కనకగిరి గుట్టల్లో నాలుగైదు చిరుతలు సంచరిస్తున్నట్లు గుర్తించామని సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల తెలిపారు. ఈమేరకు చిరుతలకు ఎవరూ హానీ తలపెట్టకుండా అటవీ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్ తండా సమీపాన వెదురు డిపోలో శుక్రవారం జరిగిన కలప వేలం పాటను పర్యవేక్షించిన ఆమె మాట్లాడారు. వెదురు డిపోలో వేలం ద్వారా ఏటా రూ.30లక్షల నుండి రూ.50లక్షల మేర ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఇక అటవీ ప్రాంతంలో వన్యమృగాల సంరక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే కాక నీటి నిల్వల కోసం చెక్‌డ్యాంలు, నీటి కుంటలు, రాతి కట్టడాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా గ్రామస్తులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ అరవిందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు టౌన్ ప్లానింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ జోన్ పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది బృందం శనివారం ఖమ్మం రానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు వస్తున్నారు. ఈసందర్భంగా అధికారుల బృందం నగరంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించనుంది. విస్తరించిన రహదారులు, జంక్షన్లు, గోళ్లపాడు చానల్, లకారం, మినీ లకారం ట్యాంక్ బండ్‌ను 50 మందితో కూడిన బృందం పరిశీలిస్తుందని అధికారులు వెల్లడించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడగా.. పాఠశాల విద్యార్థులకు కూడా కంటి పరీక్షలు నిర్వహించాలని జెడ్పీటీసీలు వాంకుడోతు జగన్, చెక్కిలాల మోహన్‌రావు, కట్టా అజయ్‌కుమార్, నంబూరి కనకదుర్గ కోరారు. ఈసమావేశంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. కాగా, జెడ్పీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని చైర్మన్ ప్రారంభించారు. అలాగే, సాయంత్రం ఐబీ, ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన చైర్మన్ కమల్‌రాజ్ మధిర నియోజకవర్గంలో సాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షించాలని సూచించారు.

నేనే.. కాదు నేను!





బానోత్ చంద్రావతి



బానోత్ మదన్‌లాల్



లావుడ్యా రాములునాయక్

వైరా బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట

- వచ్చే ఎన్నికల్లో పోటీకి సై అంటున్న నేతలు
- నియోజకవర్గంలో పోటాపోటీగా కార్యక్రమాలు
- సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేల మధ్య టికెట్ వార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ తరఫున వైరా నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో బహు నాయకత్వంతో టికెట్ ఎవరికి దక్కుతుందోననే ఉత్కంఠ బీఆర్ఎస్ కేడర్‌తోపాటు సామాన్యుల్లోనూ నెలకొంది. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, బానోతు చంద్రావతి టికెట్ వేటలో ఉన్నట్లు సంకేతాలు వెలువరిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరికి వారే అధిష్టానం దృష్టిలో పడేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తుండగా.. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అన్ని విధాలుగా నెగ్గుకురాగల నేతకే బీఆర్ఎస్ టికెట్ దక్కుతుందనే వాదన వినిపిస్తోంది.

సై అంటే సై..

గతంలో నుంచే సిట్టింగ్ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ నడుమ కోల్డ్ వార్ నడుస్తోంది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇద్దరు నేతలు కార్యక్రమాల్లో వేగం పెంచారు. నిత్యం స్థానికంగా పలు కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజల మధ్య ఉంటూనే పార్టీ పిలుపునిచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈనెల 17న ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా లావుడ్యా రాములు నాయక్, బానోత్ మదన్‌లాల్ వర్గాలు వేర్వేరుగానే వేడుకలు నిర్వహించాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేను కావడంతో తానే బరిలో ఉంటానని లావుడ్యా రాములునాయక్.. గత ఎన్నికల్లో ఓటమి చెందినా పార్టీకి విధేయుడిగా ఉన్నందున తనకే టికెట్ వస్తుందన్న ధీమాలో మదన్‌లాల్ ఉన్నారు.

రంగంలోకి చంద్రావతి..

2014 సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం చంద్రావతికి ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ సభ్యురాలిగా అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత కొంత స్తబ్దుగా ఉన్న ఆమె... వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే వైరాలో క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని, నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. తాజాగా కారేపల్లిలో మాట్లాడుతూ తనకు టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా పార్టీ విధేయురాలిగానే ఉన్నానని, సీఎం కేసీఆర్‌పై తనకు నమ్మకం ఉందని.. ఆయన ఆదేశిస్తే తాను బరిలో నిలుస్తానని పేర్కొన్నారు. దీంతో వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ టికెట్ కోసం త్రిముఖ పోటీ నెలకొన్నట్లయింది.

ఈసారైనా జెండా ఎగురవేయాలని..

2014, 2018 ఎన్నికల్లో వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటమి చవిచూసింది. అయితే వచ్చే ఎన్నికల్లోనైనా పార్టీ జెండా ఎగురవేయాలని నాయకత్వం ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తోంది. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిస్థితులతో మాజీ ఎంపీ పొంగులేటి, ఎమ్మెల్యే రాములునాయక్ వర్గాలు నియోజకవర్గంలో దూకుడు పెంచాయి. పొంగులేటి ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అలాగే, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వరుసగా అన్ని మండలాల్లో పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు జిల్లా నాయకత్వంతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీ కూడా హాజరవుతుండడంతో వైరాలో ఎన్నికల వేడి మొదలైనట్లయింది.

ముగ్గురూ ముగ్గురే..

వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోని ముగ్గురు నేతల మధ్య టికెట్ వార్ నడుస్తోంది. 2014 ఏడాదిలో బీఆర్ఎస్(అప్పటి టీఆర్ఎస్) నుంచి బానోతు చంద్రావతి బరిలో నిలిచి ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీకి దిగిన బానోత్ మదన్‌లాల్ గెలిచారు. అనంతర పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరిన మదన్‌లాల్ 2018 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లావుడ్యా రాములు నాయక్, సీపీఐ అభ్యర్థిగా విజయాబాయి, సీపీఎం అభ్యర్థిగా వీరభద్రం పోటీ పడడంతో రాములునాయక్ గెలిచి బీఆర్ఎస్ గూటికి చేరారు. ఈ పరిణామాలతో వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే స్థాయి నేతలు ముగ్గురు కొనసాగుతున్నారు. వీరు ముగ్గురూ బలమైన నేతలే కావడంతో టికెట్ కోసం అధిష్టానం వద్ద ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అంబేద్కర్ స్ఫూర్తితోనే సంక్షేమ పథకాలు

రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు



అదనపు గదులను ప్రారంభించాక విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి

ఖమ్మం సహకారనగర్: రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బీఆర్.అంబేద్కర్ స్ఫూర్తితోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. జెడ్పీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన ఆశయాలను అమలు చేస్తూ నిజమైన అంబేద్కర్ వాదిగా పాలన సాగిస్తున్నారని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే కాక అన్ని వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని మోమినాన్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మన బస్తీ – మన బడి కార్యక్రమం ద్వారా రూ.67.59లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, సుడా, డీసీఎంఎస్ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, రాయల శేషగిరిరావు, రైతుబంధు సమితి జిల్లాకన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, సీఈఓ వీ.వీ.అప్పారావు, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, డీఈఓ సోమశేఖరశర్మ, కార్పొరేటర్ అమృతమ్మ, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలని తపన!

- శిక్షణ డబ్బు కోసం చోరీల బాట
- నిందితుడి అరెస్టు.. రూ.45లక్షల సొత్తు స్వాధీనం
- ఏడుగురు సభ్యుల దోపిడీ ముఠా కూడా అరెస్టు...



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ వారియర్, పక్కన అధికారులు

ఖమ్మంక్రైం: ప్రపంచంలో అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనేది ఆ యువకుడి తపన. కానీ శిక్షణ పొందేందుకు ఆర్థిక స్థోమత లేదు. దీంతో చోరీల బాట ఎంచుకున్న ఆయన చివరకు పోలీసులకు పట్టుబడగా భారీ మొత్తంలో సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ శుక్రవారం వెల్లడించారు. ఖమ్మం అర్బన్ మండలం పాండురంగాపురానికి చెందిన సంపటి ఉమాప్రసాద్‌కు ఎవరెస్ట్ శిఖరం అధిరోహించాలనేది కల కాగా, జిమ్‌కు వెళ్తూ దేహదారుఢ్యంపై శ్రద్ధ వహించేవాడు. అయితే, పర్వతాలు అధిరోహించడానికి ప్రత్యేక శిక్షణ అవసరమని, అందుకోసం డబ్బు చాలా ఖర్చవుతుందని తెలుసుకున్నాడు. దీంతో ఆయన డబ్బు సంపాదనకు దొంగతనాలే మార్గమని నిర్ణయించుకున్నాడు. రెండేళ్ల నుంచి ఉదయమంతా డాబుసరిగా తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రివేళ చోరీలకు పాల్పడేవాడు. ఖానాపురం హవేలీ పోలీసుస్టేషన్ పరిధిలో ఆరు, ఖమ్మం టూటౌన్ పరిధిలో రెండిళ్లలో దొంగతనాలు చేశాడు. దొంగిలించిన సొత్తులో నగదు, బంగారు ఆభరణాలు ఉండటంతో వాటిని అమ్మి సొమ్ము చేసుకున్నాక ఎవరెస్ట్ అధిరోహణకు శిక్షణ తీసుకోవాలని భావించాడు. ఈక్రమంలోనే జిల్లా కేంద్రంలో చోరీలు పెరుగుతుండడంతో పోలీసులు నిఘా ఏర్పాటుచేయగా, శుక్రవారం ఉదయం బైపాస్ రోడ్డులో సీసీఎస్, ఖమ్మం టూ టౌన్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఉమాప్రసాద్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల వ్యవహారం బయటపడింది. ఈ సందర్భంగా నిందితుడి నుంచి రూ.42లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వారియర్ వెల్లడించారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు

ఖమ్మం రూరల్ సబ్ డివిజన్‌లోని రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్‌ల్లో బైక్‌లపై వెళ్తున్న వారిని బెదిరించి దోపిడీకి పాల్పడుతున్న ఏడుగురి ముఠాను కూడా పోలీసులు అరెస్టు చేశారు. పాన్నెకల్ క్రాస్ రోడ్డు వద్ద చేపట్టిన తనిఖీల్లో పగడాల విజయ్ అలియాస్ చంటి, ధంసలాపురానికి చెందిన సాదెం లక్ష్మీనారాయణ, దానవాయిగూడెంకు చెందిన షేక్ సైదులు, ఖమ్మంకు చెందిన షేక్ షబాజ్ అలియాస్ సిద్ధిఖీ అలియాస్ షాబు, బోనకల్ మండలం చినబీరవెల్లికి చెందిన పాకాలపాటి ధర్మతేజ, ఖమ్మం ప్రకాష్ నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్, రామన్నపేటకు చెందిన పసుపులేటి సాయి పట్టుబడ్డారు. వీరిలో కొందరు ఆటో, కారు డ్రైవర్లుగా, ఇంకొందరు పంక్చర్ షాపులు నడుపుతున్నారు. అయితే, జల్సాలకు అలవాటు పడిన వీరు ముఠాగా ఏర్పడి శివారు ప్రాంతాలలో ఒంటరిగా వెళ్లే జంటలను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. ఈక్రమంలో 16 కేసుల్లో నిందితులైన వీరిని అరెస్టు చేసి రూ.7.50లక్షల విలువైన ఆభరణాలు, రూ.14.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా రూ.67లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్న సీసీఎస్, ఖమ్మం నగర, రూరల్ పోలీ సులను సీపీ వారియర్ అభినందించి క్యాష్ అవా ర్డులు అందజేశారు. ఈసమావేశంలో అడిసనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రవి, గణేష్, బస్వారెడ్డి, సీఐలు శ్రీధర్, రామకృష్ణ, జితేందర్‌రె డ్డి, ఎస్సైలు వెంకటకృష్ణ, వరాల శ్రీనివాస్, సురే ష్, గిరిధర్‌రెడ్డి, సిబ్బంది గజేంద్ర, శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ సమస్యలపై నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



బి.మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగర వాసులను కుక్కలు, కోతుల బెడద వేధిస్తోంది. దీనికి తోడు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య ఎదుర్కొంటున్న వారు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' సమన్వయం చేయాలని సంకల్పించింది. ఈమేరకు శనివారం ఫోన్ ఇన్ ఏర్పాటుచేయగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి పాటుపడతారు.

తేది : 25-02-2023, శనివారం, సమయం : ఉదయం 10నుంచి 11గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్: 79012 98265

విజ్ఞాన భాండాగారంగా గ్రంథాలయం



గ్రంథాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితరులు

- వందేళ్లకు సరిపడా వసతులతో నిర్మాణానికి శ్రీకారం
- శంకుస్థాపన చేసిన ఎంపీ బండి పార్థసారథిరెడ్డి
- హాజరైన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: సమాజానికి సేవ చేసేందుకు డబ్బు ఉండడం భగవంతుడు ఇచ్చిన అవకాశం.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సత్తుపల్లి గ్రంథాలయాన్ని విజ్ఞాన భాండాగారంగా వందేళ్ల అవసరాలకు సరిపడేలా తీర్చిదిద్దుతామని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. ఎంపీ సొంత నిధులతో సత్తుపల్లిలో నిర్మించనున్న గ్రంథాలయ భవనానికి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావుతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఏటా సీఎం కేసీఆర్‌కు తాను ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వాలని సంకల్పించానని, అందుకే శంకుస్థాపనలతో కాలయాపన చేయకుండా పనులు వేగంగా చేపట్టాలని సూచించారు. ఈ గ్రంథాలయానికి అనుబంధంగా ప్రతీ పాఠశాలకు లైబ్రరీ ఏర్పాటు చేసేలా నిధులు కూడా ఇస్తానని తెలిపారు. సత్తుపల్లి జూనియర్ కళాశాలకు ఒకప్పుడు సైకిల్‌పై వచ్చేవాడినని.. విద్య విలువ ఏమిటో తనకు బాగా తెలుసన్నారు. అభివృద్ధి పనులకు తాను సొంత డబ్బు వెచ్చిస్తున్నట్లు చెబుతున్నారని.. కానీ తన పరిశ్రమల్లో ప్రత్యక్ష, పరోక్షంగా పనిచేసే లక్ష మంది ఉద్యోగుల ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు. కాగా, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి ఎంపీ రూ.1.16లక్షల నగదు ప్రకటించారు.

విద్య విలువ తెలిసిన వ్యక్తి పార్థసారథిరెడ్డి

రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి సొంత నిధులతో గ్రంథాలయ ఏర్పాటుకు ముందుకు రావటం అభినందనీయమని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. విద్య విలువ తెలిసిన వ్యక్తి కావడంతోనే ఆయన ఎంపీగా ఎన్నిక కాగానే తనకు ఫోన్ చేసి విద్యాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయమన్నారని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ డబ్బు చాలా మందికి ఉన్నా, ఖర్చు చేసే మనసు కొందరికే సొంతమని తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, ఆర్డీఓ కె.సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎంపీ భరోసా

కాలేయానికి సంబంధించి అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కుందనికాశ్రీ వైద్యానికి ఎంపీ పార్థసారథిరెడ్డి హామీ ఇచ్చారు. పట్టణానికి చెందిన పూర్ణచంద్రరావు – లక్ష్మీతిరుపతమ్మ కుమార్తె 11 నెలల కుందనికాశ్రీ అరుదైన వ్యాధితో బాధపడుతుండగా, చికిత్సకు రూ.23లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో వారు ఎంపీని ఆశ్రయించగా భరోసా కల్పించారు.

మిర్చి ధర పైపైకి...

- విదేశీ ఆర్డర్లతో రోజురోజుకే రెక్కలు
- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.20,800



ఖమ్మం మార్కెట్‌లో మిర్చి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరకు రెక్కలొచ్చాయి. శుక్రవారం మిర్చి క్వింటా రూ.20,800గా ధర నమోదైంది. బుధవారం క్వింటా రూ.19,100 ఉండగా.. గురువారం సెలవు అనంతరం శుక్రవారం ఒక్కసారిగా రూ.1,700 మేర పెరగడం విశేషం. ఈ ఏడాది జిల్లాలో నాణ్యమైన మిర్చి పండినా వివిధ కారణాలతో దిగుబడి పడిపోయింది. ఈ నేపథ్యాన చైనా నుంచి జిల్లా వ్యాపారులకు ఆర్డర్లు పెరుగుతుండడంతో పోటీ పడి ధర పెంచుతున్నారు. ఖమ్మం మార్కెట్‌కు జిల్లా రైతులతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని కృష్ణా, గుంటూరు నుంచి రైతులు మిర్చి తీసుకొస్తున్నారు. కాగా, శుక్రవారం మార్కెట్‌కు 52,425 బస్తాల మిర్చి రాగా, గరిష్ట ధర క్వింటాకు రూ.20,800, మోడల్ ధర రూ.19,500, కనిష్ఠంగా రూ.14 వేల ధర నమోదైంది.

నాలుగు వారాల్లో రూ.2,800 పెరుగుదల

ఈ నెలారంభంలో క్వింటా మిర్చికి రూ.18 వేల నుంచి రూ.18,200 పలికింది. అయితే, నెల చివరికల్లా రూ.2,800 మేర పెరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, జనవరి రెండో వారంలో మిర్చి క్వింటాకు రూ.20 వేల ధర పలకగా మళ్లీ ఇప్పుడు అదే ధర వస్తోంది. ఇక తాలు మిర్చికి గరిష్టంగా రూ.11వేలు, కనిష్ఠంగా రూ.7,500 లభిస్తోంది. మార్కెట్‌కు భారీ మొత్తంలో మిర్చిరావడంతో కొనుగోళ్లను చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షల మల్లేశం తదితరులు పర్యవేక్షించారు.

59 జీఓ రిజిస్ట్రేషన్లు మొదలు..

ఖమ్మం అర్బన్‌లో తొమ్మిది రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్ చేయిస్తున్న తహసీల్దార్ శైలజ

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నివాసాలు ఏర్పాటుచేసుకున్న వారికి క్రమబద్ధీకరణ అవకాశం కల్పించగా.. జిల్లాలో రిజిస్ట్రేషన్లు శుక్రవారం మొదలయ్యాయి. స్థలాల ఉచిత క్రమబద్ధీకరణకు జీఓ 58, మార్కెట్‌ధర ప్రకారం రిజిస్ట్రేషన్‌కు జీఓ 59ని ప్రభుత్వం జారీ చేసింది. ఈమేరకు దరఖాస్తులు స్వీకరించగా.. 59 జీఓ ఆధారంగా మార్కెట్ ధర ప్రకారం నగదు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. జిల్లాలోనే ఖమ్మం అర్బన్ మండలం నుంచి అత్యధికంగా 725దరఖాస్తులు అందగా, నిర్మాణదారులు రూ.18.82కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈక్రమంలో మండలం నుంచి 12 మంది పూర్తిగా నగదు చెల్లించారు. దీంతో వీరి నుంచి తొమ్మిది మందిని తహసీల్దార్ శైలజ ఖమ్మం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించారు. కాగా, మార్కెట్ ధర ప్రకారం కాకుండా ప్రభుత్వ ధర ప్రకారమైతే అందరూ రిజిస్ట్రేషన్‌కు ముందుకు వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. దీంతో అధికారులు దరఖాస్తుదారులను కలుస్తూ వాయిదాల్లోనైనా డబ్బు చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక


వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు


మురళి, ప్రధాన కార్యదర్శి

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా దేవాలయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తోటకూర వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా బగాది మురళి, ఉపాధ్యక్షులుగా ఈ.కృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శిగా రామదాసు, కోశాధికారిగా పి.ప్రవీణ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కొత్తూరి జగన్‌మోహన్‌రావు, వీ.వీ.నర్సింహారావు వ్యవహరించారు.

అర్చక సంఘం కమిటీ...


అర్చక సంఘం కమిటీ

జిల్లా దేవాలయ అర్చక సంఘం కమిటీని కూడా ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడిగా దాములూరు వీరభద్రశర్మ, కార్యదర్శిగా నరహరి రామకృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులుగా కాసావఝ్జల రామశర్మ, సహాయ కార్యదర్శిగా తూపురాని మధుసూదనాచార్యులు, కోశాధికారిగా అవధానుల రామకృష్ణ శర్మ ఎన్నికయ్యారు.

ఏఐసీసీ ప్లీనరీలో జిల్లా నాయకులు


ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులతో నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం మొదలైన ఏఐసీసీ ప్లీనరీకి జిల్లా నాయకులు పలువురు హాజరయ్యారు. కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహమ్మద్ జావీద్‌తో పాటు పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, వడ్డే నారాయణరావు హాజరయ్యారు.

జాబ్ మేళాలో 88 మంది ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని డీపీఆర్‌సీ బిల్డింగ్‌లో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన అపోలో ఫార్మసీ ఆధ్వర్యాన ఈ మేళా నిర్వహించగా హాజరైన 162 మందిలో 88 మంది వివిధ పోస్టులకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలను డీఐసీ జీఎం అజయ్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం పర్యవేక్షించారు.

'ఆసరా' ఫిర్యాదులపై డీపీఎం విచారణ


నేలకొండపల్లిలో విచారణ చేస్తున్న డీపీఎం రేవతి

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో సాంకేతిక కారణాలతో ఆసరా పెన్షన్ నిలిచిపోయిన వారి ఫిర్యాదు మేరకు డీఆర్డీఓ డీపీఎం రేవతి శుక్రవారం విచారణ చేపట్టారు. మండలంలోని మోటాపురం, నేలకొండపల్లి, అమ్మగూడెం, అప్పలనరసింహాపురంలో కూలీ పనిచేసుకుంటున్న వారి కుటుంబీకులు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారంటూ పింఛన్లు నిలిపేశారు. ఈమేరకు బాధితులు ఫిర్యాదు చేయగా విచారణకు వచ్చిన డీపీఎం క్షేత్రస్థాయిలో వివరాలు ఆరా తీశారు. ఉద్యోగులు లక్ష్మణ్, హుస్సేన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీజీఎస్ జిల్లా మహాసభలు

కారేపల్లి: గిరిజనుల సమస్యల పరిష్కారం, హక్కు సాధనకు పోరాడుతున్న తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) మూడో జిల్లా మహాసభలు కారేపల్లిలో శనివారం జరగనున్నాయి. ఈమేరకు ఏర్పాట్లు చేయగా, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ శోభన్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు భానోత్ భస్సీలాల్ శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజన యువతకు ఉపాధి లేక వలస వెళ్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈక్రమంలో బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుతో పాటు ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా మహాసభల్లో కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వజ్జా రామారావు, అజ్మీరా శోభన్‌నాయక్, భూక్యా హుస్సేన్ పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఇంకా ఎన్నాళ్లు చేస్తావ్?

- ఈనెలాఖరులోగా పూర్తికావాల్సిందే...
- 'డబుల్' ఇళ్ల నిర్మాణ పనులపై కలెక్టర్ గౌతమ్


ఇళ్ల నిర్మాణంలో జాప్యంపై ఐటీడీఏ జేఈ సుబ్బరాజును మందలిస్తున్న కలెక్టర్ గౌతమ్

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లి రూరల్: లబ్ధిదారులను ఎంపిక చేసి ఆరు నెలలైంది.. సంప్ లేదు.. ఇతర పనులూ చేయలేదు.. ఇంకెన్నాళ్లు చేస్తావ్.. ఇలానే ఉంటే విజిలెన్స్ విచారణ జరిపిస్తా.. అని ఐటీడీఏ జేఈ సుబ్బరాజుపై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని వేంసూరు రోడ్డులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పనులను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇళ్లు పాడైపోతున్నాయి.. పిచ్చి పిచ్చిగా ఉందా.. మంజూరు చేసి ఇన్నాళ్లయినా పనులు కాకపోతే ఎలా అంటూ మండిపడ్డారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్డీఓ సూర్యనారాయణను ఆదేశించారు. వచ్చేనెల 10వ తేదీ నాటికి పనులు పూర్తవుతాయని జేఈ సమాధానం చెప్పడంతో ఈనెలాఖరులోగా పూర్తికావాలిన్సందేనని స్పష్టం చేశారు. అలాగే, ఇటీవల ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో సౌకర్యాలపై పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను ఆదేశించారు. ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ సురేష్, ఆర్‌ఐ జానీమియా, ఎంపీఈఓ కృష్ణ పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జీఓ 59 ద్వారా ఫీజు చెల్లించిన 36మందికి రిజిస్ట్రేషన్లు చేయగా కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. ఆర్డీఓ కె.సూర్యనారాయణ, సబ్‌రిజిస్ట్రార్ కత్తుల విజయ్, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

కల్లూరు: కల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ నాయకులు కోటూరి మానవతారాయ్ ఆధ్వర్యన పలువురు కలెక్టర్ గౌతమ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. లాటరీ విధానంలో నిబంధనలు పాటించలేదని తెలిపారు. దీంతో స్పందించిన కలెక్టర్ నిరుపేదలు ఉంటే ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షల పథకాన్ని వర్తింపచేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు దామాల రాజు, షేక్ జానీపాషా, ఉమామహేశ్వరి, ఉమర్, రమాదేవి, కోటేశ్వరి, వహీదా, సత్యవతి పాల్గొన్నారు.

హైవే పనుల్లో వేగం పెంచండి

ఖమ్మం రూరల్: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి మిగుల్లో పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. తల్లంపాడు వంతెన వద్ద పనులను శుక్రవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. అండర్ పాస్ రావడంతో విద్యుత్ లైన్ ఎత్తు పెంచాల్సి ఉన్నందున వెంటనే పనులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, నేషనల్ హైవే పీడీ దుర్గాప్రసాద్, తహసీల్దార్ సుమ పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆమె కంటివెలుగు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, పోడు భూముల దరఖాస్తుల పరిశీలనపై వీసీ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ 58, 59జీఓల ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట త్వరగాలబ్ధిదారును ఎంపిక చేయాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జీఓ 58ద్వారా పట్టాలు సిద్ధమయ్యాయనిన, పోడు భూములకు సంబంధించి డీఎల్సీ సమావేశాలు చివరి దశలో ఉన్నాయని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, డీఆర్వో శిరీష, డీఎంహెచ్ఓ బి.మాలతి, డీఏఓ విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ, డీడబ్ల్యూఓ కృష్ణనాయక్, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాహ బంధం అమూల్యమైనది...

- విడాకులతో విచ్ఛిన్నం చేసుకోకండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్/కారేపల్లి: భార్యాభర్తలు వివాహ బంధంతో ఒక్కటయ్యాక జీవితాంతం కష్టసుఖాలను కలిసి పంచుకోవాలే తప్ప విడాకులతో విచ్ఛిన్నం చేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాలో శుక్రవారం ఏర్పాటుచేసిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగామాట్లాడారు. మనకి నచ్చని ఘటనలు జరిగినప్పుడు వచ్చే కోపాన్ని త్వరగా తగ్గించుకుని అందరితో స్నేహంగా మెదిలితే కక్షలు, కార్పణ్యాల్పుండవని తెలిపారు. భార్యాభర్తల మధ్య సమస్యలకు ప్రధాన కారణమైన వరకట్న దురాచారాన్ని రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం భ్రూణ హత్యల నిరోధక చట్టం, అవినీతి నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఇక న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సాయం అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి.శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, ఎస్సై పుష్పాల రామారావు, న్యాయ సహాయ న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఏఓ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ద్వారా ఈనెల 26న నిర్వహిస్తున్న డివిజనల్ అకౌంట్స్ అఫీసర్స్(డీఏఓ) పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, ఏఓలతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో 27 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 9,456 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఓఎంఆర్ షీట్‌లో వివరాల నమోదు, బబ్లింగ్‌లో తప్పులు దొర్లకుండా అభ్యర్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉదయం పరీక్షకు 9–45 గంటల తర్వాత ఎవరికీ కేంద్రంలోనికి అనుమతించొద్దని స్పష్టం చేశారు. ఈసమావేశంలో డీఆర్వో శిరీష, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, సత్యనారాయణ, టీఎస్‌పీఎస్‌సీ సెక్షన్ అధికారులు డీ.కే.శుక్లా, జాకీరుద్దీన్, టి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వినతి

ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కోచైర్మన్ చల్లా లింగరాజు కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీఆర్ఏలకు పే స్కేల్, వారసత్వ ఉద్యోగాలు, అర్హులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగరాజు, క్రాంతికుమార్, వేణు, రాము తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

మత్స్యశాఖ జిల్లా అధికారి ఆంజనేయస్వామి


మత్స్యకారులతో ఆంజనేయస్వామి తదితరులు

తిరుమలాయపాలెం : చేపల పెంపకంతో మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆ శాఖ జిల్లా అధికారి ఆంజనేయస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని పాతర్లపాడు చెరువు వద్ద శుక్రవారం పాతర్లపాడు, పిండిప్రోలు, జూపెడ గ్రామాల మత్స్యకారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులు తమ వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని, అందుకు అవసరమైన మెళకువలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం వైరాకు చెందిన మీరా సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధ్యక్షుడు బోయిని లింగయ్య, కార్యదర్శి కోతుల ఉపేందర్, సభ్యులు కోతుల అర్జున్, బోయిని నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

పాల్వంచ/మణుగూరు రూరల్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్సీ విడుదల చేయాలని, ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలని, ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పాల్వంచలో కేటీపీఎస్, మణుగూరులో బీటీపీఎస్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఆందోళనతో ఉదయం షిఫ్ట్‌నకు వెళ్లే ఉద్యోగ, కార్మికులు నిలిచిపోయారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ ప్రకటనపై జెన్‌కో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన, మార్చి 1 నుంచి 4వ తేదీ వరకు మధ్యాహ్న భోజన సమయంలో కర్మాగారంలో ధర్నాలు, 8వ తేదీ నుంచి 23వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడతామని వివరించారు. మార్చి 24న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. పాల్వంచలో జేఏసీ నాయకులు సుధీర్, బ్రహ్మాజీ, మధుబాబు, మాజీద్, సీతారాం రెడ్డి, అఖిలేష్ రెడ్డి, రాధాకృష్ణ, నరసింహారావు, రాజేందర్, కోటేశ్వరరావు, రవీందర్, నాగేశ్వరరావు, ప్రభాకర్, శివరామ్, వేణుగోపాల్, మణుగూరులో జేఏసీ నాయకులు వి.ప్రసాద్, రవిప్రసాద్, రవితేజ, బి.సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, వీరస్వామి, రాజబాబు, దయాకర్, కె.నరసింహారావు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం


కార్యాలయంలో పురుగుల మందు తాగుతున్న గోపాలరావు

వైరా: అప్పు కోసం తాకట్టు పెట్టిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరానికి చెందిన ఇండ్ల గోపాలరావు 1205 సర్వే నంబర్‌లోని 242 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి సాదా అగ్రిమెంట్ రాయించుకున్నాడు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన గోపాలరావు నగదు అవసరాల కోసం ప్లాట్ కాగితాన్ని ఓ నాయకుడి వద్ద తాకట్టు పెట్టాడు. అయితే, ఎన్నికల్లో గోపాలరావు ఓడిపోగా, నగదు చెల్లించకపోవడంతో శుక్రవారం సదరు నాయకుడు ప్లాట్ అమ్మిన వ్యక్తి నుంచి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న గోపాలరావు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. కాగా, ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు రాలేదని తెలిపారు.

పీఆర్‌టీయూ హాల్ నిర్మాణానికి భూమిపూజ


కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వానికి మద్దతుగా ఉంటూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా నిలుస్తున్న పీఆర్‌టీయూకు అన్ని విధాలుగా సహకరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులోని పీఆర్‌టీయూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేయగా, మంత్రి పువ్వాడ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం తాము పీఆర్‌టీయూ బాధ్యులతో సంప్రదింపులు జరుపుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామని తెలిపారు. ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, జెడ్పీ, సుడా చైర్మన్లు కమల్‌రాజ్, విజయ్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగారావుతో పాటు సీహెచ్.ప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు, విజయ్, శేఖర్‌రావు, బ్రహ్మారెడ్డి, మోహన్‌రెడ్డి, హరిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం

పాల్వంచరూరల్/ఇల్లెందు : భద్రాద్రి జిల్లాలో శుక్రవారం వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. పాల్వంచ మండలంలో ఏడుగురిని కాటేయగా, ఇల్లెందు పట్టణంలో ఇంటి ఆవరణలో కట్టేసి ఉన్న మేకలపై దాడి చేసి 9 పిల్లలను చంపేశాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కుక్కకాటు బాధితులకు పాల్వంచ ఏరియా ఆస్పత్రి, జగన్నాథపురం పీహెచ్‌సీలో చికిత్స అందించారు. జగన్నాథపురానికి చెందిన జర్పుల దుర్గాప్రసాద్ – లలిత దంపతుల 16 నెలల చిన్నారి భానుశ్రీ ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కుక్క కాటు వేసింది. అదే గ్రామంలోని జామాయిల్ తోటలో పనిచేస్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సాద్విక్, ప్రతిభ, రంగాపురం గ్రామానికి చెందిన సురేష్, పూసుగూడేనికి చెందిన తులసీరాం, ఉప్పుసాకకు చెందిన నాలుగేళ్ల సుచిత, పాల్వంచకు చెందిన హేమంత్ కుక్కల దాడిలో గాయపడ్డారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రూ.3 లక్షల నగదు, రూ.15 లక్షల దొంగనోట్లు స్వాధీనం
- నలుగురు వ్యక్తుల అరెస్టు, పరారీలో మరొకరు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్, సీఐ సత్యనారాయణ

కొత్తగూడెంటౌన్: నకిలీ కరెన్సీ నోట్లు చెలామణీ చేసేందుకు వచ్చిన ఓ ముఠా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో టీ తాగేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడింది. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. శుక్రవారం వన్‌టౌన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఎస్‌ఐ టి.లచ్చయ్య తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో ఆ ప్రాంతానికి వచ్చిన నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారు జూలూరుపాడు మండలం కొమ్ముగూడేనికి చెందిన బానోతు భోజ్యానాయక్, ఖమ్మం జిల్లా వేంసూరు మండలానికి చెందిన తనమల్ల రాజశేఖర్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమలంక గ్రామానికి చెందిన బీరెపల్లి రాంబాబు, కొత్తగూడెం బాబుక్యాంప్‌నకు చెందిన జలమని భాస్కర్‌గా తేలింది. ఈ నలుగురు కారు ఓనర్ చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీకి చెందిన పున్నం ప్రసాద్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు నకిలీ కరెన్సీ నోట్లు చెలామణీ చేయాలని పథకం వేసుకున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం మార్కెట్ ఏరియాలో నకిలీనోట్లు చెలామణీ చేసేందుకు బయల్దేరిన నలుగురు టీ తాగేందుకు బస్టాండ్ సెంటర్‌కు వచ్చారు. అనుమానాస్పదంగా వ్యవహరించి పోలీసులకు పట్టుబడ్డారు. కారులో తనిఖీ చేయగా రూ.3 లక్షల నగదు, దొంగనోట్లు తయారు చేయడానికి ఉపయోగించే యాసిడ్ బాటిళ్లు, నల్లపేపర్ బండిళ్ల కట్టలు 5, చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఉపయోగించే 500 నకిలీ నోట్ల కట్టలు 33 లభ్యమయ్యాయి. కారుతోపాటు నగదు, నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా కారు ఓనరు పున్నం ప్రసాద్ పరారీలో ఉన్నాడని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో వన్‌టౌన్ సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై టి.లచ్చయ్య, కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, ఘని, సురేష్, వీరన్న, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ఆత్మహత్యాయత్నం

రఘునాథపాలెం: భూమి విషయమై తనకు న్యాయం చేయాలంటూ ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని కొర్లబోడు తండాకు చెందిన వివాహిత భర్త పదేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయన బతికి ఉన్నప్పుడు వ్యవసాయ భూమిని అమ్మగా, ఎక్కువ భూమి తీసుకున్నారని పెద్దల సమక్షాన శుక్రవారం పంచాయితీ నిర్వహించారు. ఈక్రమంలోనే ఆమె తనకు న్యాయం చేయాలంటూ పురుగుల మందు తాగేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం ఇరువర్గాల వారిని పోలీసులు తీసుకెళ్లినట్లు తెలిసింది.

రైలుకింద పడి యువకుడు మృతి

కారేపల్లి: గుర్తుతెలియని యువకుడు(35) రైలు కిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి కారేపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు... కారేపల్లిలోని పేరుపల్లి రైల్వే గేట్ సమీపాన గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి మృతి చెందాడు. మృతదేహం ముక్కలై గుర్తుపట్టలేని స్థితిలో ఉండగా, కారేపల్లి రైల్వేస్టేషన్‌లో అధికారులకు సమాచారం ఇచ్చారు. కాగా, సదరు యువకుడు కొత్తగూడెం వైపు నుంచి కారేపల్లి వైపు వస్తున్న గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా అనేది తెలియరాలేదు.

వివాహేతర సంబంధం నేపథ్యాన దేహశుద్ధి


పోలీసు వాహనం వద్ద గుమికూడిన బంధువులు

నేలకొండపల్లి: వివాహేతర సంబంధం గుట్టురట్టు కావడంతో ఇద్దరిని గదిలో బంధించి దేహశుద్ధి చేశారు. మండలంలోని మంగాపురం తండాకు చెందిన ఇద్దరికి వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు జన్మించాక ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయమై పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించినా మార్పు రాలేదు. దీంతో శుక్రవారం ఇద్దరు గదిలో ఉండగా, బంధువులు చేరుకుని బంధించి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా వారిని తీసుకెళ్లే క్రమంలో బంధువులు అడ్డుకోగా, పోలీసులు నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

క్లుప్తంగా...

అజయ్ బంగా హెచ్‌పీఎస్ విద్యార్థే

ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన బంగా



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా నామినేట్ అయిన భారత–అమెరికన్ అజయ్ బంగా బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) విద్యార్థే. మాస్టర్ కార్డ్ మాజీ సీఈవో అజయ్ బంగా 1976 బ్యాచ్‌కు చెందిన హెచ్‌పీఎస్ విద్యార్థి. ప్రస్తుత వరల్డ్ బ్యాంకు ప్రెసిడెంట్ మాల్పాస్ తర్వాత అజయ్ నామినేట్ అయిన సంగతి తెలిసిందే. 'మా పూర్వ విద్యార్థుల్లో మరొకరు ప్రపంచ సంస్థలో ఉన్నత స్థాయికి చేరుకోవటం పాఠశాలకు గర్వకారణం' అని హెచ్‌పీఎస్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్టీ జే నోరి యా తెలిపారు. కాగా, ప్రపంచంలోని ప్రముఖ కంపెనీల అధినేతలు హెచ్‌పీఎస్ విద్యార్థులే కావటం విశేషం. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల, అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో పాటు కావియం కో–ఫౌండర్ సయ్యద్ భఫ్రత్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, క్రికెటర్ కామెంటర్ హర్షా భోగ్లే, ప్రముఖ సినీనటులు రానా దగ్గుపాటి, అక్కినేని నాగార్జున, రామ్‌చరణ్, ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వంటి ఎందరో ప్రముఖులు హెచ్‌పీఎస్ పూర్వ విద్యార్థులు.

కొత్తగా 16 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 3,209 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో కరోనా నుంచి నలుగురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది.



ఏపీలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 'ఈనాడు' ప్రతులను తగులబెడుతున్న ప్రజలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఏపీ గవర్నర్‌గా జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం పదవీ స్వీకార ప్రమాణం చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. పదవీ స్వీకార ప్రమాణం అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అభినందనలు తెలిపి సత్కరించారు.

ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు పుష్కలం

- పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ముందుంది
- సగటున 12 రోజుల్లోనే అనుమతులు
- పరిశ్రమలకు 48 వేల ఎకరాలు సిద్ధం
- హైదరాబాద్‌లో జీఐఎస్ రోడ్ షోలో మంత్రులు రాజేంద్రనాథ్, అమర్‌నాథ్
- ఏపీలో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం



సమావేశంలో పాల్గొన్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సుదీర్ఘ తీరప్రాంతం, పుష్కలమైన వనరులు, సుశిక్షితులైన మానవ వనరుల లభ్యత, వ్యాపారాలకు ప్రభుత్వ తోడ్పాటు తదితర సానుకూల అంశాలతో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యామ్నాయం మరేదీ లేదని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సత్వరం అనుమతులు మంజూరు చేస్తూ వ్యాపారాలు, పరిశ్రమలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఏపీ ప్రభుత్వం ముందుందని చెప్పారు. విశాఖ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (జీఐఎస్) 2023కు సంబంధించి హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో వారు మాట్లాడారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. సుస్థిర అభివృద్ధి సాధిస్తూ ముందుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిశ్రమలకు అవసరమైన సకల మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని మంత్రి బుగ్గన వివరించారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు నైపుణ్యాల్లో శిక్షణకు కూడా పెద్ద పీట వేస్తోందన్నారు. ఐటీ, బల్క్ డ్రగ్ పార్క్, పీసీపీఐఆర్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెరైన్, వ్యవసాయం, పునరుత్పాదకశక్తి వంటి రంగాలలో పెట్టుబడులకు ఏపీ అనుకూలమన్నారు.

అనుమతుల సమయాన్ని కుదించాం

రాష్ట్రంలో పరిశ్రమల కోసం 48వేల ఎకరాలకు పైగా స్థలం సిద్ధంగా ఉందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలకు స్థలం కాకుండా సగటున 12 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయని తెలిపారు. కొత్తగా తేబోయే పాలసీలో 21 రోజుల్లో స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నట్లు వివరించారు. 974 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం, 534 ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లు, 6 సెజ్‌లు, 3 ఐటీ సెజ్‌లు, 3 పారిశ్రామిక కారిడార్లు, మంచి వృద్ధి రేటుతో పెట్టుబడులకు పూర్తి అనుకూలమని పేర్కొన్నారు. వైజాగ్ ఐటీ గమ్యస్థానంగా మారుతోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో వేలకొద్దీ చిన్న, మధ్య తరహా సంస్థలు ఏర్పాటవుతున్నాయని ఏపీటీపీసీ చైర్మన్ కె.రవిచంద్రారెడ్డి తెలిపారు. బాక్సైట్, మాంగనీస్ తదితర 48 రకాల ఖనిజాల లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ఏపీలో అవకాశాలను తెలియజేసేందుకు, పారిశ్రామిక భాగస్వామ్యాలు కుదుర్చుకునేందుకు జీఐఎస్ తోడ్పడుతుందని తెలంగాణ సీఐఐ వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి చెప్పారు.

పారిశ్రామికవేత్తల హర్షం

ప్రస్తుతం రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తున్న పారిశ్రామికవర్గాలు ప్రభుత్వ సహకారంపై సంతృప్తి వ్యక్తం చేశాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటునందిస్తోందని డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎండీ డీవీఎస్ నారాయణ రాజు తెలిపారు. ఏపీలోని తమ ప్లాంటులో నీరు, విద్యుత్ కొరత లేదని చెప్పారు. విద్యుత్, ఇంధనం కూడా మిగతా రాష్ట్రాలతో పోలిస్తే చౌకగా లభిస్తున్నాయన్నారు. స్విచ్‌గేర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డైరెక్టర్ ఒ.జగన్నాథ్ మాట్లాడుతూ తమ సంస్థ ఇప్పటికే చిత్తూరు ఇండస్ట్రియల్ పార్క్‌లో కార్యకలాపాలు సాగిస్తోందని, మరో రూ.150 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు సబ్సిడీలు అందిస్తోందని, పరిశ్రమల నిర్వహణ సులభతరం చేసిందని వివరించారు.

విచారణపై సందేహాలు

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు కొనసాగింపుగా శుక్రవారం రెండోసారి సీబీఐ అధికారుల విచారణకు హాజరైనట్లు తెలిపారు. గతంలో విచారణప్పుడు మరోమారు పిలుస్తామని చెప్పారని, ఈసారి మాత్రం మళ్లీ విచారణకు రావాలని చెప్పలేదన్నారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే..

మీడియా బాధ్యతగా వ్యవహరించాలి

- మీడియా బాధ్యతగా వార్తలు ప్రసారం చేయాలని మనవి చేస్తున్నా. గతంలోనూ ఇదే విషయం చెప్పాను. మళ్లీ అదే చెబుతున్నా. నేను విజయమ్మ గారి దగ్గరికి వెళ్లి వస్తే.. బెదిరించి వచ్చానని చర్చలు పెట్టి, ప్రచారం చేస్తున్నారు. అది ఎంత వరకు సబబు? నేను దుబాయ్‌కి వెళ్లిపోయానని వక్రీకరించే వార్తలు వేస్తున్నారు.
- తెల్లవారుజామున 3 గంటలకు ఫోన్లు చేశానని వక్రీకరించే వార్తలు వేయడమే కాకుండా దానిపై గంటల తరబడి, రోజులపాటు చర్చలు పెడుతున్నారు. విచారణ జరుగుతున్నప్పుడు మీడియా బాధ్యతగా మెలగాలి. మీడియానే ట్రయల్ పూర్తి చేసి..దోషులెవరో, నిర్దోషులెవరో మీడియానే నిర్ణయిస్తోంది. ఇది విచారణపై ఎంత ప్రభావం పడుతుందో ఒకసారి మీరే ఆలోచించండి. ఒక అబద్ధాన్ని సున్నా నుంచి వందకు పెంచే ప్రయత్నం జరుగుతోంది. అదేవిధంగా ఒక నిజాన్ని వంద నుంచి సున్నా చేసే ప్రయత్నం జరుగుతోంది.
- ముందు నుంచి కూడా ఫ్యాక్ట్ టార్గెట్‌గా కంటే పర్సన్ టార్గెట్‌గా విచారణ జరగడం సరికాదు. గూగుల్ టేకౌట్ అన్నది నిజమైన గూగుల్ టేకౌటా.. టీడీపీ టేకౌటా అన్నది భవిష్యత్తులో కాలమే నిర్ణయిస్తుంది. ఎందుకు ఈ మాట అంటున్నానంటే.. సీబీఐ సమర్పించిన కౌంటర్‌లోని విషయాలన్నీ ఏడాది క్రితం టీడీపీ వాళ్లు చేసిన విమర్శలే. అందువల్ల ఎవరికైనా సందేహాలు రావడం సహజం. ఈ పరిస్థితిలో విచారణ సరైన కోణంలో వెళ్లాలని చెబుతున్నాను తప్ప.. నేను అనుమానించడం లేదు.

ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా

- వివేకం సార్ చనిపోయిన రోజు నేను మార్చురీ దగ్గర మీడియాతో మాట్లాడాను. మళ్లీ రెండు రోజుల తర్వాత కూడా మీడియాతో మాట్లాడాను. ఆ రోజు ఏం మాట్లాడానో.. ఈ రోజు కూడా అదే మాట్లాడుతున్నా. సీబీఐ వాళ్లకు అదే చెబుతున్నా. ఎవరెన్నిసార్లు పిలిచి అడిగినా అదే చెబుతా. ఎందుకంటే నాకు తెలిసిన నిజం అదే కాబట్టి.
- ఆ రోజు ఆ విషయం గురించి మీడియాతో మాట్లాడిన మొట్టమొదటి వ్యక్తి నేనే. అందుకే నేను ఆ రోజు చెప్పిందే ఈ రోజూ చెబుతున్నా. సీబీఐ వారి ప్రశ్నలకు నాకు తెలిసిన సమాధానాలు చెప్పాను.
- వివేకం సార్ చనిపోయిన రోజు సీన్ ఆఫ్ క్రైంకి నేను వెళ్లేటప్పటికే అక్కడ ఒక లెటర్ ఉంది. కానీ, ఆ లెటర్‌ను దాచిపెట్టారు. ఆ లెటర్‌లో అది హత్య అని స్పష్టంగా ఉంది. అందులో అనేక అంశాలు ఉన్నాయి. ఆ విషయాల గురించి నేను చెప్పడం కంటే భవిష్యత్తులో అవన్నీ బయటికి వస్తాయి.
- ఇంతకు ముందు అడిగినట్టే అడ్వొకేట్ సమక్షంలో ప్రశ్నించాలని, అన్ని విషయాలు ఆడియో.. వీడియో రికార్డింగ్ చేయాలని ఇప్పుడు కూడా కోరాం. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్ కూడా లెటర్ పెట్టాం. కానీ అది జరగలేదు. అయితే ఒక ల్యాప్‌టాప్‌ను మాత్రం నా ముందు ఉంచారు. అది ఎందుకోసం అన్నది నాకు తెలియదు.

నియోజకవర్గ కమిటీలకు పెద్దపీట

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తి సమయం ఇచ్చే 90 మంది కార్యకర్తలను ఎంపిక చేసి వారికి తొలుత వచ్చే నెల 3 నుంచి 6 వరకు నియోజకవర్గాలవారీగా వర్క్‌షాప్స్ నిర్వహించనుంది. అనంతరం అభియాన్ నిర్వహణ తీరుపై శిక్షణ ఇవ్వనుంది. అలాగే పోలింగ్‌బూత్ కమిటీల్లో సభ్యుల సంఖ్యను 21 నుంచి 31కి పెంచాలని బీజేపీ నిర్ణయించింది.

'బండి'ఆధ్వర్యంలోనే ఎన్నికలు...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలోనే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ తాజాగా స్పష్టతనిచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయడంలో భాగంగా సంస్థాగతంగా మార్పులు చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గం, అధికార ప్రతినిధులు, జిల్లా కమిటీలు, ఏడు మోర్చాలు, అనుబంధ విభాగాల్లో అంతగా క్రియాశీలంగా లేనివారు, పార్టీ ఆశించిన మేర పనిచేయని వారు, నిర్దేశిత లక్ష్యాలను సాధించని వారిని పక్కన పెట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జిల్లా అధ్యక్షుల పనితీరును ప్రాతిపదికగా చేసుకొని దాదాపు 20–25 జిల్లాల అధ్యక్షుల స్థానంలో నియోజకవర్గస్థాయి అధ్యక్షులు లేదా ఇన్‌చార్జీలతో ఎన్నికల కసరత్తుకు దిగాలనే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. వారిలో 20 జిల్లాల అధ్యక్షులు, కమిటీల మూడేళ్ల పదవీకాలం ముగిసినందున ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి.

పర్యవేక్షణ ఫుల్‌టైమర్లదే: బన్సల్

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీకి సంబంధించిన అంశాల పర్యవేక్షణ బాధ్యత పార్టీ ఫుల్‌టైమర్లదేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ స్పష్టంచేశారు. శక్తికేంద్రాల (3, 4 పోలింగ్ బూత్‌లు కలిపి ఒక శక్తికేంద్రం) ఇన్‌చార్జీలతో పాటు పార్టీ మండల అధ్యక్షులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం రాత్రి దాకా పార్టీ కార్యాలయంలో 17 లోక్‌సభ నియోజకవర్గాలు, 40–50 అసెంబ్లీ నియోజకవర్గాల ఫుల్‌టైమర్లతో బన్సల్, జాతీయ కార్యదర్శి, సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్‌సమీక్షించారు. ఎన్నికలు ముగిసేదాకా ఫుల్‌టైమర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే బస చేసి, పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వార్తలు

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 7నుంచి 8 గంటల వరకు ఖమ్మం 55వ డివిజన్ బ్యాంక్ కాలనీలో వాడవాడ పువ్వాడ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటిస్తారు. ఆతర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్న మంత్రి, అనంతరం అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం ఎంపీపీఎస్‌లో మన ఊరు–మన బడి పనులను ప్రారంభిస్తారు. అలాగే, నారంవారిగూడెంలో నూతక్కి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించాక ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి, ఖమ్మం జిల్లా వైరాలో జరిగే ప్రైవేట్ కార్యక్రమాల్లో మంత్రి పువ్వాడ పాల్గొంటారు.

తామర పురుగు నివారణపై అవగాహన

మధిర: మినుము, పెసర పంటలను తామర పురుగు ఆశిస్తున్నందున సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీ దేవి, ఎంటమాలజీ శాస్త్రవేత్త కె.నాగస్వాతి సూచించారు. పంటల్లోని లేత ఆకులపై తామర పురుగులు వృద్ధి చెంది ఆకుల అడుగుభాగం నుంచి రసం పీలుస్తుండడంతో మొక్కలు గిడసబారి ఎదుగుదల పడిపోతుందని తెలిపారు. అంతేకాక ఈ పురుగుల వల్ల ఆకు ముడత వైరస్ వ్యాపిస్తుందని పేర్కొన్నారు. ఈమేరకు తామర పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ ఎఫ్ఎస్ 5 మిల్లీలీటర్లతో కిలో విత్తనాన్ని శుద్ధి చేయాలని సూచించారు. పురుగుల ఉధృతిని గుర్తించేందుకు నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే, మోనోక్రోటోపాస్ 1.6 ఎం.ఎల్, ఎసిఫేట్ 1.5 ఎం.ఎల్, పిప్రోనిల్ 2.0 ఎం.ఎల్ లేదా సైనోసాడి 0.3 ఎం.ఎల్, ఎసిఫేట్ ఒక గ్రాముకు లీటర్ నీటిలో కలిపి మార్చి మార్చి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. ఇక పంట పొలాల్లో వయ్యారిభామ కలుపు లేకుండా చూడాలని తెలిపారు.

డీఏఓ అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఆదివారం జరగనున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎస్తేర్ ప్రభులత తెలిపారు. కేంద్రాలకు గంట ముందుగానే చేరుకునేలా సాధారణ చార్జీలతో రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి బస్సులు నడిపిస్తామన్నారు. అన్ని బస్టాండ్లలో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

అటవీ సంపద రక్షణే ధ్యేయం

- భద్రాచలంలో నాలుగు రాష్ట్రాల అధికారుల భేటీ
- కార్యాచరణపై సమీక్ష



భద్రాచలంలో సమావేశమైన నాలుగు రాష్ట్రాల అటవీ అధికారులు

భద్రాచలం అర్బన్: రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న అటవీ సంపద రక్షణే ధ్యేయంగా చర్యలు చేపట్టాలని నాలుగు రాష్ట్రాల అటవీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని అటవీ కార్యాలయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ అధికారులు శుక్రవారం భేటీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఎఫ్ఓ రంజిత్‌నాయక్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా డీఎఫ్ఓ తేజస్ శేఖర్, బీజాపూర్ నుంచి అశోక్ పాటిల్, ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి కె.ప్రతాప్, ఏపీలోని చింతూరు నుండి వి.సాయిబాబా, భద్రాచలం నుంచి బి.బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాల సరిహద్దుల్లో అక్రమ కలప రవాణాను అరికట్టేందుకు సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. అంతేకాకుండా అంతర్‌రాష్ట్రాల అటవీ సరిహద్దులపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ పోడు, గొత్తికోయల చొరబాటు, అటవీ భూముల ఆక్రమణ, అటవీ ఫలసాయం రవాణా, సరిహద్దు అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇక ఉత్పత్తుల సేకరణలో నాణ్యత పాటించేలా పర్యవేక్షిస్తూ రాష్ట్రాల్లోని అటవీ సిబ్బంది మధ్య సమన్వయానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. అంతేకాకుండా రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీ కేంద్రాల నిర్మాణం, నోడల్ అధికారుల నియామకం, పులి, ఇతర అటవీ జంతువుల కదలికలు, పరిరక్షణకు సంయుక్తంగా చర్యలు చేపట్టాలనే తదితర అంశాలపై చర్చించారు.

నేల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వరంగల్ ఆర్ఈఆర్ఎస్ ఏడీఆర్ ఉమారెడ్డి



నేల ప్రాముఖ్యత బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఉమారెడ్డి, అధికారులు

మహబూబాబాద్ రూరల్: రైతులు నేల ఆరోగ్యంపై దృష్టి సారించాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు ఆర్.ఉమారెడ్డి సూచించారు. మహబూబాబాద్ జిల్లా మల్యాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన శాస్త్రీయ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ రైతు కూడా నేల ఆరోగ్యంపై దృష్టి పెడుతూ, పచ్చిరొట్ట పంటలు వేయడం ద్వారా ఎరువుల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. అలాగే, పంటల అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని, తద్వారా భూమి సారవంతంగా మారుతుందని చెప్పారు. అనంతరం రైతుల అవగాహన కోసం రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈసమావేశంలో మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, అగ్రి పాలిటెక్నిక్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, అధికారులు బి.ఛత్రునాయక్, సూర్యనారాయణ, కె.సమ్మయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



ఎస్సారెస్పీ జలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పాటుపడుతోందని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తెలిపారు. కేసముద్రం మండలం వెంకటగిరి శివారులోని వట్టివాగులోకి ఎస్సారెస్పీ జలాలు విడుదలైన సందర్భంగా ఎమ్మెల్యే శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టివాగులో నీరు లేకపోవడంతో ఇరువైపులా 30వేల ఎకరాల్లో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని రైతుల చేసిన విజ్ఞప్తితో ఉన్నతాధికారులతో మాట్లాడి ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయించామని తెలిపారు. ఈసందర్భంగా ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయించిన ఎమ్మెల్యేకు రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ మాదారపు సత్యనారాయణరావుతో పాటు నాయకులు ఎండీ.నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, గణపారపు రమేష్, పెదగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ



దాతకు రశీదు అందచేస్తున్న ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం ఏపీకి చెందిన భక్తులు నగదు విరాళంగా అందచేశారు. విశాఖపట్నంకు చెందిన ఏఎస్‌వీఎస్ఎల్.అరవింద రూ.1,08,000 నగదును ఆలయ అధికారులకు అందచేయగా వారు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్మీ 'వజ్ర' వాహనం

వైరాలో మరమ్మతులు, ఆపై హైదరాబాద్‌కు...



మరమ్మతుల అనంతరం హైదరాబాద్ వెళ్తున్న వజ్ర వాహనం

వైరా: ఆర్మీ జవాన్లతో వెళ్తున్న సీఐఎస్ఎఫ్‌కు చెందిన మైన్ ప్రూఫ్ వజ్ర వాహనం ఖమ్మం జిల్లా వైరాలో మొరాయించింది. ఛత్తీస్‌గఢ్‌లోని జబల్పూర్ నుంచి జవాన్లతో వజ్ర వాహనం శుక్రవారం హైదరాబాద్‌కు బయలుదేరింది. కొత్తగూడెం జిల్లా సరిహద్దు వరకు అక్కడి పోలీసులు, ఖమ్మం జిల్లాలో జిల్లా పోలీసులు బందోబస్తుగా వస్తున్నారు. ఈక్రమంలో వైరా పాత బస్టాండ్ సమీపానికి రాగానే డీజిల్ లీకేజీ సమస్యతో వాహనం మొరాయించడంతో జాతీయ రహదారి పక్కన నిలిపేశారు. అందులో నుంచి బలగాలు తుపాకులతో కిందకు దిగడంతో స్థానికులు ఆందోళనకు గురికాగా, వాహనానికి సమస్య ఎదురైందని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు అనంతరం మరమ్మతు చేయించాక ఆర్మీ బలగాలు హైదరాబాద్ బయలుదేరాయి.

సైనిక్ స్కూల్, కళాశాలలో ప్రవేశానికి రేపు పరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్/పాల్వంచ రూరల్: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్, కళాశాలలో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం పరీక్ష జరగనుంది. ఈ విషయాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ రీజినల్ కోఆర్డినేటర్ ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10నుంచి 12.30 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఖమ్మంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, టేకులపల్లిలోని జూనియర్ కళాశాల, పాల్వంచలోని తెలంగాణ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(బాలికలు)తో పాటు మహబూబాబాద్‌లోని గురుకుల జూనియర్ కళాశాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష సమయానికి అర గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

సింగరేణిలో వైద్యుల నియామకం



అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 26 మంది వైద్యుల నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఏర్పాటుచేయగా డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈమేరకు 43మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా హాజరైన 17మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు గాను ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్యతో పాటు అధికారులు బీ.వీ.రావు, శ్రీనివాస్, వేణుగోపాల్, డాక్టర్ సునీల, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యుడిగా మాజీ మంత్రి సంభాని



సంభాని చంద్రశేఖర్

కల్లూరు/కూసుమంచి: ఏఐసీసీ సభ్యుడిగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కు స్థానం దక్కింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శుక్రవారం మొదలైన ఏఐసీసీ ప్లీనరీలో ఈమేరకు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సంభాని నియామకాన్ని ప్రకటించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సహకరించిన సోనియాగాంధీ, రేవంతరెడ్డి, సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్కకు పలువురు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సంభాని నియామకంపై కాంగ్రెస్ కల్లూరు మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు మాదిరాజు లక్ష్మణ్‌రావు, కొండూరి కిరణ్‌కుమార్, గుండ్ల పుల్లారావు, కీసర శ్రీనివాసరెడ్డి, పోతురాజు నరేంద్ర, జిళ్ళేళ్ళ కృష్ణారెడ్డి, జొన్నలగడ్డ గోపాలస్వామి, ఎండీ.హఫీజుద్దీన్, పీర్యానాయక్, బెల్లంకొండ శరత్, కిరణ్, బందారుపల్లి శ్రీనివాస్, వనం మధుసూదన్, బాబునాయక్, భూపాల్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.